వాకింగ్‌కు వెళ్తే స్కేటింగే..


వాకింగ్ ట్రాక్‌పై నిలిచిన వర్షపు నీరు

- వాకింగ్ ట్రాక్‌పై నిలుస్తున్న వర్షపునీరు
- భయపడుతున్న వాకర్స్
- నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

మల్కాపురం: ఆ ట్రాక్‌పై అడుగు పెడితే ఫీట్లు వేయాల్సిందే. స్కేటింగ్ చేయాల్సిందే. ఆరోగ్యం కోసం వాకింగ్‌కు వెళ్లిన వారు దెబ్బలు తగిలించుకోవాల్సి రావడంతో వర్షాల సమయంలో వాకింగ్ పార్కు వైపు కన్నెత్తి చూసేందుకు వాకర్స్ భయపడుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద సుమారు ఎకరం స్థలంలో జీవీఎంసీ అధికారులు వాకింగ్ అండ్ సైక్లింగ్ పార్కును 15 ఏళ్ల కిందట నిర్మించారు.దీంతో జింక్ నుంచి మల్కాపురం ప్రాంతాలకు చెందిన వాకర్స్ ప్రతి రోజు ఉదయం,సాయంత్రం ఇక్కడకు వచ్చి వాకింగ్ చేస్తుంటారు. వాకర్స్ **మట్టితో వేసిన మార్గంతో** పాటు పక్కనే బీటీ **మార్గం సైక్లింగ్ చేసే వారికి** ఏర్పాటు చేశారు. మధ్యలో క్రికెట్,వాలీబాల్,బాస్కెట్‌బాల్,షటిల్ ఆడుకునేందుకు కోర్టులతో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. అయితే అంతా బాగున్నా వర్షాలు పడేటప్పుడు ఇక్కడ సమస్య వస్తోంది.క్రీడాకారులు ఆడుకునే మైదానం గుంతల మయంగా ఉండడంతో వర్షాలు భారీగా పడినప్పుడు వర్షపునీరు నిలిచిపోతుంది. వాకింగ్ ట్రాక్‌పై చేరిన నీరు పోయే మార్గం లేకపోవడంతో బురద మయంగా మారుతోంది. ఇటుగా వచ్చే వాకర్స్ జారిపడుతున్నారు.సోమవారం ఉదయం కురిసిన వర్షానికి చేరిన నీరు వల్ల ఓ యువకుడు రన్నింగ్ చేస్తు జారి పడిపోయాడు.

అలాగే 55 ఏళ్ల మహిళ జారి పడ్డారు. మట్టితో కూడిన వాకింగ్ ట్రాక్ పై పీవీసీ తో కూడిన పైకప్పు అమర్చాలని... దీని వల్ల వర్షపునీరు ట్రాక్‌పై పడదని చెబుతున్నారు.అలాగే మైదానంలో వర్షపునీరు నిలవకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని వాకర్స్ కోరుతున్నారు.


మైదానంలో నిలిచిన వర్షపు నీరు

బురదమయం



వాకింగ్ ట్రాక్‌పై, మైదానంలో వర్షపు నీరు నిలిచిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.వర్షాకాలంలో వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా ట్రాక్‌పై పీవీసీతో కూడిన పైకప్పు అమర్చితే మంచిది.

– ఆకుల కనకరాజు, వాకర్ ఇందిరాకాలనీ

జారి పడుతున్నాం



వాకింగ్ కోసం పార్కుకు వెళ్తే జారి పడే పరిస్థితి నెలకుంటుంది.మట్టి ట్రాక్‌పై వర్షపునీరు నిలిచి బురదమయంగా మారడంతో ఈ సమస్య తలెత్తుతోంది.అధికారులు స్పందించి వాకర్స్ జారకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి.

– కాకర ప్రకాష్‌రావు, వాకర్. మల్కాపురం

నిత్యం ఇదే తంతు


ములగాడ సేవా మార్గంలో తవ్విన గోతులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ మార్గంలో ప్రయాణం అంటే వాహన చోదకులు హడలెత్తిపోతున్నారు. ఉదయం,సాయింత్రం ట్రాఫిక్ సమస్య నెలకుంటుంది. ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గంలో భూగర్భ విద్యుత్ కేబుల్ వేసేందుకు వారం కిందట గోతులు తవ్వారు. గోతుల నుంచి వచ్చిన మట్టిని రోడ్డుపక్కన విడిచిపెట్టారు. దీంతో రోడ్డు మరింత ఇరుగ్గా మారింది. దీంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు నెలకుంటున్నాయి. ఈ ప్రాంతంలో వాహనాలను క్రమబద్ధీకరించడానికి ట్రాఫిక్ పోలీసులను నియమించాలని వాహనదారులు కోరుతున్నారు.


సేవా మార్గంలో నిలిచిన వాహనాలు

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన


వెంకటాపురంలో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో దోమల వల్ల కలిగే వ్యాధులు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ మంగళవారం కళాజాతా నిర్వహించారు. జీవీఎంసీ మలేరియా విభాగం అధికారుల ఆధ్వర్యంలో కళాకారులు వెంకటాపురం ప్రాంతంలో పలు చోట్ల ప్రదర్శనలిచ్చారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని.. మంచి నీరు ఎక్కువ రోజులు నిల్వలేకుండా పాత్రలు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వారంలో రెండు రోజులు డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

సింధియా: షిప్‌యార్డ్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని టీఎస్‌టీయూసీ నాయకులు తెలిపారు. సంస్థలోని పలు విభాగాలు కార్మికులు మంళవారం టీఎస్‌టీయూసీలో చేరారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులు శ్రేయస్సు, కార్మిక చట్టాల పరిరక్షణ, కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఫరీద్, ఎం.రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భవానీలకు అన్నసమారాధన


అన్నసమారాధన చేస్తున్న నమ్మి రాజా రమేష్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో హనుమాన్ కనస్ట్రక్షన్ అధినేత రాజారమేష్ ,రేవతి మంగళవారం భవానీలకు అన్నసమారాధన నిర్వహించారు. దుర్గాదేవిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి హారతులు అందించారు. కార్యక్రమంలో నమ్మి కొండలరావు, రమణమ్మ, ఖుషి, మాన్విత, జశ్వంత్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం ఉదయం 9.30గంటల నుంచి వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

విద్యార్థులకు ముగిసిన టైలరింగ్ శిక్షణ


శిక్షణ పొందిన విద్యార్థులు

గాజువాక: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన కుట్టుమిషన్ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఒకేషనల్ విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21న ప్రారంభమైన ఈ శిక్షణా కార్యక్రమం పదిరోజుల పాటు సాగింది. 31 మంది విద్యార్థులు తర్ఫీదు పొందారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతి తెలిపారు. భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలకు ఈ శిక్షణ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయురాలు భారతి, కో ఆర్డినేటర్ మెట్ట సుధాకర్ భట్లు, జీసీడీవో గుమ్మడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. నమోస్తుతే


గొల్లవీధి వద్ద దుర్గాదేవి అవతారంలో అమ్మవారు


అమ్మవారికి సారె తీసుకు వెళ్తున్న భక్తులు

మల్కాపురం: దుర్గాదేవి శరన్నవరాత్రుల సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు మండపాల వద్ద అమ్మవారు మంగళవారం దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దుర్గాష్టమి సందర్భంగా మల్కాపురం గొల్లవీధి వద్ద డేరింగ్ డేషింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి మందార పూలు, గులాభీ మాలలను అలంకరించారు. స్థానిక మహిళలు వివిధ పిండి వంటలు,మిఠాయిలు,పండ్లను సారె రూపంలో మల్కాపురం పుర వీధుల్లో ఊరేగించి అనంతరం సమర్పించారు.

- ఇదే ప్రాంతంలో అల్లరి యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి మండపం వద్ద అంబళం పూజ నిర్వహించారు. వెయ్యి మంది భక్తులు కుంకుమార్చన నిర్వహించారు.

- గాజువాక ఆర్టీసీ డిపో వద్ద కొలువుదీరిన దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐస్ గడ్డతో శివలింగం,దుర్గాదేవి రూపాలను నెలకొల్పారు. మహిళలు చేసిన కోలాట నృత్యం ఆకట్టుకుంది.


అమ్మవారి మండపం వద్ద కోలాటం చేస్తున్న మహిళలు


ఐస్ గడ్డతో శివలింగం, దుర్గమ్మ రూపం

ఇస్కాన్‌లో రావణదహనం రేపు

కొమ్మాది: దసరా వేడుకల్లో భాగంగా సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో గురువారం రాత్రి 7 గంటలకు రావణ దహనం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ ప్రకటనలో తెలిపారు. 50 అడుగుల రావణుడి భారీ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం ప్రత్యేకమైన ఫైర్ క్రాకర్స్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు, రామలీలలపై ప్రవచనాలు ఉంటాయని తెలియజేశారు. ఆ రోజు ముందుగా మందిరంలో రాధాకృష్ణులను, జగన్నాథ, సుభద్ర, బలభద్రులను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని పేర్కొన్నారు.

స్కూటీ దగ్ధం


కాలిపోయిన స్కూటీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో క్వార్టర్ ముందు పార్క్ చేసిన బైక్ దగ్ధమైంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–5లోని 505 డి క్వార్టర్‌లో స్టీల్‌ప్లాంట్ సీనియర్ మేనేజర్ పి. సుందరరావు నివాసముంటున్నారు. సోమవారం రాత్రి క్వార్టర్ ముందు స్కూటీ పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కింద క్వార్టర్‌కు చెందిన వ్యక్తి స్కూటీ కాలిపోవడం గమనించి సుందరరావుకు సమాచారం ఇచ్చారు. వారు ఫైర్ విభాగానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే స్కూటీ పూర్తిగా కాలిపోయింది.

కార్మిక నాయకుడికి ఘన సత్కారం


ముత్యాలు దంపతులను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం నుంచి పదవీ విరమణ చేస్తున్న కార్మిక నాయకుడు జెర్రిపోతుల ముత్యాలును మంగళవారం విభాగం కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సత్కరించారు. విభాగం జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ముత్యాలు సేవలను కొనియాడారు. ఉద్యోగిగా, కార్మిక నాయకుడిగా అందరి మన్ననలు పొందారన్నారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు కొమ్ము ప్రసాద్, బి.వి. కన్నబాబు, శివరామకృష్ణ, విభాగం అధికారులు నాయక్, బి. శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న సీపీ


దుర్గాదేవికి కుటుంబ సమేతంగా పూజలు చేస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

మల్కాపురం: దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో విశాఖ వెస్ట్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగాలీలు నిర్వహిస్తున్న దసరా వేడుకల్లో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా సీపీ బాగ్చి మాట్లాడుతూ విశాఖ నగరంలో ప్రశాంత వాతావరణంలో విజయదశమి వేడుకలు జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. నగరంలో క్రైం రేటు తగ్గుముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు. పండగకి ఊరు వెళ్లే వారు జాగ్రత్తగా ఇళ్లకు తాళాలు వేసి, స్వీయరక్షణ కోసం ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. చోరీలను నియంత్రించేందుకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. దుర్గామాత ఆశీస్సులు ఉంటే విజయం సిద్ధిస్తుందని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

‘పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించనివ్వం’


పోర్టు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు ఆస్పత్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుని తీరుతామని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నిరసన దీక్షలు 365 రోజులుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్‌కు ఎవరూ ముందుకు రాలేదని, పోర్టు యాజమాన్యం వద్ద ఉన్న సొంత నిధులతోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విశాఖ నగర అభివృద్ధికి పోర్టు ఎంతో కీలకమన్నారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోకుంటే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఐద్వా నాయకురాలు సుమిత్ర, రైతు సంఘం నాయకుడు నాయన బాబు పాల్గొని సంఘీభావం తెలిపారు. సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ,జె.సత్యనారాయణ, గణేష్, శంకర్రావు, నర్సింగరావు, త్రినాథరావు, ఈశ్వరరావు, రాఘవులు పాల్గొన్నారు.

గిరిజనులకు అప్పన్న చిత్రపటాల అందజేత

సింహాచలం: అల్లూరి సీతారామరాజుజిల్లా ముంచంగిపుట్టు మండలం జర్జుల పంచాయతీలోని తమ్మేగుల, ఆమ్లకూడ, శరబంద గుర్రాబయలు గ్రామాల్లో సింహాచలంకు చెందిన సింహాద్రిమఠం ఆధ్వర్యంలో మంగళవారం హిందు ధర్మ ప్రచారం చేశారు. సింహాద్రి మఠం నిర్వాహకుడు, శ్రీనృసింహ దీక్ష గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి హిందు ధర్మ విశిష్టతను గిరిజనులకు తెలియజేశారు. శ్రీనృసింహ దీక్ష విశిష్టతని చాటిచెప్పారు. 128 గిరిజన కుటుంబాలకు శ్రీనృసింహస్వామి చిత్రపటాలు అందజేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి ,నాయకులు

పెదగంట్యాడ: మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకుంటామన్నారు. మార్టుపూడి పరదేశి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, గొందేశి మహేశ్వరరెడ్డి, కొయ్య భారతి, రోజారాణి, గొందేశి వెంకటరమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ, కటికల కల్పన, సంపంగి ఈశ్వరరావు, కాకినాడ పెంటారావు, వెంకటేష్, డాక్టర్ ఎస్ రాజారావు, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం

దాబాగార్డెన్స్: మెలోడి క్రియేటర్స్ రజతోత్సవ వేడుకలు ఈ నెల 4న నిర్వహించనున్నారు. దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయం గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్‌ఎన్ రాజుకు ఆహ్వాన పత్రిక అందించి, ఆయన చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విశాఖ నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు చెప్పారు. కళాభిమానులు, సంగీతప్రియులు, సాంస్కృతిక సంస్థల అధినేతలు పాల్గొని మెలోడి క్రియేటర్స్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అలాగే సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక వైభవం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, నటరత్న, యువరత్న పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, కార్యదర్శి, ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, కొణతాల రాజు, వి.ప్రభాకర్, మేడా మస్తాన్‌రెడ్డి, అరుణకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, నిర్వాహకులు

సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రభుత్వం మంజూరు చేసిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో రిక్షా కాలనీ, రామచంద్రనగర్, స్వతంత్రనగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంత ప్రజలు గంగవరం పోర్టు కాలుష్యంతో పాటు డంపింగ్ యార్డ్ నుంచే వచ్చే దుర్వాసనతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పెడితే మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమణ, వెంకట్రావు, త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.